క్లుప్తంగా

బీమాతో భరోసా



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్ : నిరుపేద కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం భరోసానిస్తుందని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కార్వన్‌పేటకు చెందిన దాసరి భాగ్యమ్మ అనే మహిళ మృతి చెందింది. ఆమె కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద రూ.లక్ష చెక్కును నామినీ అయిన కుమారుడు చిటికెల బసవరాజ్‌కు అందజేశారు. కౌన్సిలర్, ఎస్సీ సెల్ పట్టణాధ్యక్షుడు వై.పి.కృష్ణమోహన్, నాయకులు చిన్నలక్ష్మన్న, శేఖన్న, మూర్తి, శీన, షాషావలి, సూరి పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు

మంత్రాలయం రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు రామతీర్థం అమ్రేష్ పేర్కొన్నారు. మండలంలోని బూదూరు గ్రామంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. రాయలసీమ యూనివర్సిటీలో అడ్మినిస్ట్రేటివ్ సూపరింటెండెంట్ ఎండీ ఇస్మాయిల్, ప్రొఫెసర్ శ్రీనివాసరావు అంబేడ్కర్ గురించి అనుచితంగా మాట్లాడటం దారుణమని ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అథ్లెటిక్స్ పోటీల్లో రాణించిన క్రీడాకారులు



పతకాలు సాధించిన ఆదోని క్రీడాకారులు

ఆదోని అర్బన్ : గుంటూరులో జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఆదోని పట్టణానికి చెందిన క్రీడాకారులు గోల్డ్, సిల్వర్ పతకాలు సాధించారు. ఈనెల 5, 6, 7వ తేదీల్లో జరిగిన లాంగ్‌జంప్, షాట్‌పుట్, పరుగుపందెం పోటీల్లో పట్టణానికి చెందిన క్రీడాకారులు పాల్గొని పథకాలు సాధించారని మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు శనివారం విలేకరులకు తెలిపారు. రామకృష్ణ, రామారావు, నాగరాజు, గిరిధర్, ప్రసాద్‌సింగ్ మూడు పోటీల్లో గోల్డ్, సిల్వర్ పతకాలు సాధించారని చెప్పారు. అనంతరం వారిని అభినందించారు.

10 నుంచి క్రికెట్ టోర్నీ

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలో ఈనెల 10వ తేదీ నుంచి పునీత్‌రాజ్‌కుమార్ మెమోరబుల్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు సీమోను,బాలు, మలకి, శివ శనివారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు సెల్ 6305510413,7989850753 నంబర్లకు ఫోన్ చేసి జట్లు పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు.

'ఒలింపియాడ్'కు విద్యార్థుల ఎంపిక

ఆదోని రూరల్ : శ్రీచైతన్య–1 పాఠశాలకు చెందిన 138 మంది విద్యార్థులు ఒలింపియాడ్ పరీక్షలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ గౌసియాఖనమ్ శనివారం తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ పరీక్షల్లో 265 మంది విద్యార్థులు పాల్గొనగా 138 మంది ఎంపికయ్యారన్నారు. ఏటీఎస్‌ఓలో 11, ఈటీఎస్‌ఓలో 27, జీటీఎస్‌ఓలో 81, ఎంటీఎస్‌ఓలో 50 మంది ఎంపికైనట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

బీమా తక్షణ సాయం అందజేత

కోసిగి: మండల కేంద్రంలోని మారెమ్మ దేవాలయం సమీపంలో నివాసముంటున్న బావిగడ్డ మారెయ్య (38), కందుకూరు గ్రామంలో శివమ్మగారి ఈరన్న (45) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. దీంతో వైఎస్సార్‌బీమా పథకం కింద తక్షణ సాయంగా రూ.10వేల చొప్పున మృతుల కుటుంబ సభ్యులకు ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెట్టన గౌడ అందజేశారు. మండల నాయకుడు మాణిక్యరాజు, బసిరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ రజిత, బాబులు పాల్గొన్నారు.

టూరిజం పరిధిలోకి రామాలయం

ఆదోని రూరల్ : మండలంలోని పెద్దతుంబళం గ్రామంలోనున్న పురాతన దేవాలయాన్ని టూరిజంలోకి తీసుకొచ్చేందుకు ప్రతిపాదనలు పంపాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారని తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. శనివారం ఆలయాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఆమె మాట్లాడుతూ పర్యాటక శాఖ ఆలయ అభివృద్ధికి చర్యలు చేపడుతుందని చెప్పారు. ఆలయాన్ని పర్యాటక శాఖలోకి విలీనం చేయనున్నారనే విషయంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

భూ సమస్యలకు చెక్

హొళగుంద: రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎల్లార్తి సర్పంచ్ కురువ చాముండేశ్వరి తెలిపారు. శనివారం సచివాలయంలో రైతులకు భూ రీ సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వేకు రైతులు సహకరించాలన్నారు.

మెట్ట పొలాలకు పాతాళగంగ

మెట్ట పొలాల్లో సైతం రైతులు సిరులు పండించాలని ప్రభుత్వం వైఎస్సార్ జలకళ పథకం ద్వారా ఉచితంగా బోర్లు తవ్వించి, విద్యుత్ కనెక్షన్, మోటార్లను అందజేస్తుంది. ముందుగా హైడ్రో,జియలాజికల్, జియోఫిజికల్ నిపుణులు జల వనరులను అన్వేషించి బోరు తవ్వకానికి అనుమతిస్తారు. ఆదోని డివిజన్‌లో ఇప్పటి వరకు 115 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా అధికారులు 96 మందిని అర్హులుగా తేల్చి 52 మంది పొలాల్లో బోర్లు వేయించి, విద్యుత్ కనెక్షన్ సైతం ఇచ్చి, మోటార్లకు ప్రతిపాదనలు పంపారు.



దుద్ది పొలాల్లో వైఎస్సార్ జలకళ కింద బోరు వేయిస్తున్న అధికారులు

- వైఎస్సార్ 'జలకళ' ద్వారా బోర్ల ఏర్పాటు
- ఆదోని డివిజన్‌లో దరఖాస్తు చేసుకున్న 115 మంది రైతులు
- అర్హులుగా తేలిన 96 మంది.. 52 బోర్లు వేసిన అధికారులు
- సన్న, చిన్నకారు రైతులకు వరంగా మారిన పథకం

కోసిగి: చిన్న, సన్నకారు రైతులు మెట్ట పొలాల్లో రాజనాలు పండించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ జలకళ పథకాన్ని అమలు చేస్తుంది. ఆదోని క్లస్టర్ పరిధిలోని గతేడాది 27 బోర్లు వేయించారు. ఈ ఏడాది రెండో విడతలో 67 బోర్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 25 బోర్లు వేయగా మిగిలిన రైతులకు రోజు వారీగా వేస్తున్నారు.

పథకం అమలు ఇలా..

2.50 ఎకరాల నుంచి 5 ఎకరాల లోపు రైతులకు వైఎస్సార్ జలకళ పథకం వర్తిస్తుంది. అర్హుల పొలాల్లో జియాలజిస్ట్ సూచన మేరకు 500 అడుగుల నుంచి 600 అడుగుల వరకు రూ.75వేల నుంచి రూ.90వేల వరకు ఖర్చు చేసి ప్రభుత్వమే బోరు వేయిస్తుంది. నీరు పడిన రైతులకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి రూ.35వేల విలువజేసే మోటారును ఉచితంగా అమర్చుతుంది.

జలకళకు ఎంపికైన గ్రామాలు..

ఆదోని క్లస్టర్‌లోని పెద్దతుంబళం, మంత్రాలయం మండలంలోని చెట్నహళ్లి, సంకేశ్వరి, పెద్దకడబూరు మండలంలోని దొడ్డిమేకల, కోసిగి మండలంలోని దుద్ది, డి.బెళగల్, సాతనూరు, అగసనూరు, ఆర్లబండ, కొల్మాన్‌పేట, కందుకూరు గ్రామాలను ఎంపిక చేశారు. ఆయా గ్రామాల రైతులు వైఎస్సార్ జలకళ పథకం కోసం 115 మంది దరఖాస్తులు చేసుకోగా రెండు విడతల్లో 96 మందిని ఎంపిక చేశారు. వీరిలో ఇప్పటి వరకు 52 మంది పొలాల్లో బోర్లు వేయించారు. ఆయా పొలాల్లో వేసిన బోర్లలో పుష్కలంగా నీరు లభించడంతో విద్యుత్ మోటార్లు అందజేయడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు.

పొలంలో ఉచితంగా బోరు వేశారు



వైఎస్సార్ జలకళ పకథం కింద మా పొలాన్ని ఎంపిక చేశారు. సర్వే నంబర్ 332లో 2.80 ఎకరాల భూమి బయలు పొలం ఉంది. సాగునీటి వనరులు లేకపోవడంతో కేవలం వర్షాధారంగా పంటలు పండించుకునేవాళ్లం. జలకళ కింద మా పొలంలో 550 అడుగుల్లో బోరు వేశారు. మూడు ఇంచుల నీళ్లు పడ్డాయి. చాలా సంతోషంగా ఉంది. ఇకపై ఏటా రెండేసి పంటలు పండించుకోవచ్చు.

– గొర్లి నాగేష్, దుద్ది గ్రామం

దరఖాస్తు చేసుకోండి



వైఎస్సార్ జలకళ పథకం కింద ఎంపిక చేసిన గ్రామాల్లో 2.50 ఎకరాలు పై బడి 5 ఎకరాల లోపు సన్నకారు రైతులు జలకళ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. గ్రామ సచివాలయం లేక మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే అర్హత మేరకు జియాలజిస్ట్ సూచన మేరకు నీటి సామర్థ్యం ఆధారంగా బోరు వేయిస్తాం.

– గిద్దయ్య, ఆదోని క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్

ఇరువర్గాలపై కేసు నమోదు

కౌతాళం: మండలంలోని హాల్వి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. చంద్ర వర్గీయులపై దాడి చేసిన దేవిరెడ్డితో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే దేవిరెడ్డి వర్గీయులపై దాడి చేసిన చంద్రతో పాటు ఏడుగురిపై కౌంటర్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామంలో ఇరువర్గాలు శాంతియుతంగా జీవనం సాగించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

కౌతాళం: మండలంలోని అంజనేయస్వామి దేవాలయాలు భక్తులతో సందడిగా మారాయి. సుళికేరి గ్రామ శివారులో వెలసిన బుదుములదొడ్డి ఆంజనేయస్వామి, అగసలదిన్నెలోని ఆలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామి వారం కావడంతో భక్తులు తరలివచ్చి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు తెల్లవారుజామున వాయుపుత్రుడుకి సుప్రభాతసేవ, మహామంగళహరతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు జరిపించారు.బుదుములదొడ్డి ఆలయంలో సీతారాములకు పూజలు చేసి ఉత్సవ మూర్తులను రథంపై ఆశీనులు గావించి ఆలయం చూట్టూ ప్రదక్షి చేశారు. అలాగే కౌతాళం మెయిన్ బజారులో వెలసిన ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఆదోని రూరల్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌ఓ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి ఆందోళన చేపట్టారు. సంఘం డివిజన్ ప్రెసిడెంట్ ఖాదర్, జిల్లా కన్వీనర్ తిరుమలేష్, కో–కన్వీనర్ తేజ, డివిజన్ సెక్రెటరీ సురేష్, డివిజన్ నాయకురాలు మేఘన, అర్చన మాట్లాడుతూ పేద విద్యార్థుల సంక్షేమం పట్ల బాధ్యతగా వ్యవహరించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా హాస్టళ్లలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన వసతులు, భోజనం లేక అవస్థలు పడుతున్నారన్నారు. నిధులు కేటాయించినా సకాలంలో విడుదల చేయకపోవడంతో హాస్టళ్ల నిర్వహణ గాడి తప్పుతోందని చెపఆరు. నాయకులు జాను, రాజు, రంగా, నిఖిత, కృష్ణవేణి పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు భూముల పంపిణీ



పెద్దతుంబళంలో రైతులు, అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

ఆదోని రూరల్ : అర్హులైన రైతులకు భూ పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. శనివారం మండలంలోని పెద్దతుంబళం గ్రామంలోనున్న ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో 40 ఎకరాల ప్రభుత్వ భూములను గుర్తించామని, గ్రామంలో అర్హులైన రైతులు 26 మంది ఉన్నారన్నారు. మండలంలో 265 ఎకరాలకు గానూ 195 మంది రైతులను గుర్తించామని, నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపుతామని చెప్పారు. సర్వేయర్ వెంకటరమణ, వీఆర్వో చిన్న ఈరన్న, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

- ఉప్పరహాల్ గ్రామానికి ఏడాదిలో పథకాల కింద రూ.5.78 కోట్ల లబ్ధి
- రూ.2.64 కోట్లతో అభివృద్ధి పనులు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



గ్రామస్తులకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం : పేదల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శనివారం కౌతాళం మండలం ఉప్పరహాల్ గ్రామంలో పర్యటించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డితో కలిసి గ్రామంలోని ఇంటింటికీ తిరిగి వర్తించిన పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్క ఏడాదిలో ఉప్పరహాల్ గ్రామస్తులకు సంక్షేమ పథకాల ద్వారా రూ.5,78,20,250 నగదును వ్యక్తిగత ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. గ్రామంలో 2,034 మంది ఓటర్లు ఉండగా ఏడాదికి రూ.5.78 కోట్ల చొప్పున ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా విడుదల చేయడం ఇంతకు ముందెన్నడైనా జరిగిందా అని ప్రశ్నించారు. పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని ప్రజలు గుర్తించాలని కోరారు. ఇన్ని సంక్షేమ పథకాలు, ఇంత మొత్తం అందించిన పాలకుడు లేడని చెప్పారు. అలాగే మన బడి –నాడునేడు కింద రూ.1.75 కోట్లు, నూతన సచివాలయ భవన నిర్మాణానికి రూ.40 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.21.80 లక్షలు, హెల్త్‌సెంటర్‌కు రూ.14.95 లక్షలు, సామూహిక మరుగుదొడ్డికి రూ.3 లక్షలు మంజూరైనట్లు వివరించారు. గ్రామంలో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న వంకపై బ్రిడ్జిని రూ.10 లక్షలతో నిర్మించామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అత్రితనయ గౌడ్, ఉరుకుంద ఈరన్న స్వామి ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజుగౌడ్, ఎంపీపీ అమరేష్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, సర్పంచ్ తులసి, గ్రామ ఇన్‌చార్జ్ ఏకాంబరరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దాట్ల కృష్ణంరాజు, నాయకులు వీరసేనారెడ్డి, ప్రహ్లాద ఆచారీ, వెంకట్రామిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రామేశ్వరరెడ్డి, ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ అశ్వత్థామ, ఏఈ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయాధికారి శేషాద్రి, పంచాయతీ కార్యదర్శి వాహిద్, ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మతి భ్రమించింది

- 98 శాతం హామీలు నెరవేర్చిన ఘనత జగనన్నదే
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



బుక్‌లెట్ అందించి పథకాలను వివరిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు/ఆస్పరి: టీడీపీ నేత నారా చంద్రబాబుకు పదవి పోవడంతో మతి భ్రమించిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం విమర్శించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమంలో భాగంగా ఆయన శనివారం ఆస్పరి మండలం ములుగుందం గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగితెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మూడున్నరేళ్లలో ఎవరెవరికి ఎంత లబ్ధి చేకూరిందో బుక్‌లెట్ అందజేసి వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98 శాతం నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. గత ప్రభుత్వంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. పదవి పోవడంతో చంద్రబాబు జీర్ణించుకోలేక ప్రతి అభివృద్ధి పనికీ అడ్డుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, దేవరగట్టు ఆలయ చైర్మన్ శ్రీనివాసులు, ఆస్పరి సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్, ఆలూరు, ఆస్పరి మండల కన్వీనర్లు పెద్దయ్య, వీరేష్, రామాంజనేయులు, ఎంపీడీఓ రాధా, సీఈఓ అశోక్, శ్రీనివాసులరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, హనుమంతు, చిన్నఅయ్యప్ప, పురుషోత్తంరెడ్డి, ఎల్లప్ప, ప్రకాష్ పాల్గొన్నారు.

రథోత్సవ ఏర్పాట్లపై అధికారుల సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: నీలకంఠేశ్వర స్వామి మహారథోత్సవం ఆదివారం ఉండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో తహసీల్దార్ జయన్న, సీఐ మధుసూదన్‌రావుతో కలిసి కమిషనర్ అధికారులు, ఆలయ ధర్మకర్తలతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే విద్యుత్ దీపాలంకరణ, తాగునీటి వసతి, పారిశుద్ధ్య పనులు పూర్తయ్యాయన్నారు. సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామన్నారు. అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తుగా తమ వంతు చర్యలు తీసుకున్నామని ఫైర్ ఆఫీసర్ రామాంజనేయులు తెలిపారు. సమావేశంలో ఆలయ ధర్మకర్త మాచాని నాగరాజు నీల మురళీధర్, ట్రాఫిక్ ఎస్‌ఐ వెంకటసురేష్, కౌన్సిలర్ కామర్తి నాగేషప్ప పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

పత్తికొండ రూరల్: భార్య హత్య కేసులో భర్తను అరెస్ట్ చేశారు. నిందితుడి వివరాలను డీఎస్పీ శ్రీనివాసులు శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. తుగ్గలి మండలం ఎల్లమ్మగుట్టతండాకు చెందిన గౌరీబాయిని, పత్తికొండ మండలం జీవరాళ్లమల తండాకు చెందిన నెనావత్ రెడ్యానాయక్ దంపతులకు ఇద్దరు పిల్లలు సంతానం. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో గౌరీబాయి ప్రొద్దుటూరులో బంధువుల వద్ద ఉంటోంది. డబ్బు విషయమై ఆమె ఈనెల 4న పత్తికొండకు రాగా హీరో షోరూం ఎదుట ఉన్న హోటల్ వద్ద భార్యాభర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. క్షణికావేశానికి లోనైన భర్త రెడ్యానాయక్ కత్తితో పొడిచి హత్య చేశాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు చేపట్టి జీవరాళ్లమల తండా క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ మురళీమోహన్ పాల్గొన్నారు.

అవ్వాతాతలకు మెరుగైన భరోసా



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం




సభకు హాజరైన లబ్ధిదారులు

కౌతాళం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అవ్వాతాతలకు మెరుగైన భరోసా లభించిందని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సాఆర్ పింఛన్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఉప్పరహాల్ గ్రామంలో నూతన పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీలు నేరవేర్చడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మించిన పాలకుడు దేశంలోనే లేడన్నారు. హామిలకు కట్టుబడి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ బడుగు వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని కొనియడారు. కార్యక్రమంలో ఉప్పరహాల్, రౌడూరు, కుంటనహాల్, బదినేహాల్, ఎరిగేరి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు నూతన పింఛన్లు అందజేశారు. అలాగే ఏరిగేరి గ్రామానికి చెందిన మహేశ్వరి అనే మహిళకు వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరైన రూ. లక్ష చెక్కు అందజేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కుంటనహాల్, ఉప్పరహాల్ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. జలజీవన్ మిషన్ పథకం కింద కుంటనహాల్‌లో రూ.1.75 కోట్లతో, ఉప్పరహాల్‌లో రూ.58.93 లక్షలతో ఓహెచ్ఆర్, పైప్‌లైన్, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనుల్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తి తీర్చేందుకు జగనన్న బృహత్తర కార్యక్రమం చేపట్టారన్నారు. ఐదేళ్లలో ప్రతి పల్లెలో తాగునీటి ఎద్దడి అనేది ఉండదన్నారు. అలాగే కుంటనహాల్‌లో రూ.12.5 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అత్రితనయ గౌడు, ఎంపీపీ అమరేష్, సర్పంచ్‌లు పార్వతమ్మ, తులసీ, ఉరుకుంద ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్,ఎంపీపీ అమరేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దాట్ల కృష్ణంరాజు, కౌతాళం సింగల్ విండో మాజీ అధ్యక్షుడు వీరసేనరెడ్డి, ఎంపీడీఓ జగన్‌మోహన్ రెడ్డి, నాయకులు ఏకాంబర్‌రెడ్డి, శివరాం, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరు టౌన్: జగనన్న కాలనీలలో లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. శనివారం స్థానిక జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. గృహనిర్మాణాలకు కావాల్సిన మౌలిక వసతులను ఇప్పటికే కల్పించామని, లు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కమిషనర్ సూచించారు. ఆయన వెంట హౌసింగ్ డీఈ ప్రసాద్, ఇన్‌చార్జ్ ఏఈ తిలక్, అమెనిటీస్ సెక్రటరీలు ఉన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్య సేవలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నందవరం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో పేదలకు మెరుగైన సేవలు అందుతున్నాయని డాక్టర్ సౌజన్యలత తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని సచివాలయం–2 ఆవరణలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 153 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలంతలు తప్పని సరిగా నెలనెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ శాంతమ్మ పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని పార్లపల్లి సచివాలయంలో లబ్ధిదారులకు శనివారం శాశ్వత భూ హక్కు, భూ రక్ష పత్రాలను తహసీల్దార్ జయన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ రీ సర్వే పూర్తయిన రైతులకు శాశ్వత హక్కు పత్రాలు అందచేస్తున్నామన్నారు.